# మాధవ సేవయే మానవసేవ

-బ్రహ్మర్షి పత్రీజీ



# "మాధవ సేవయే మానవసేవ!"

ఈరోజు 'సేవ' అనే కాన్సెప్ట్ గురించి మరి కూలంకషంగా, ఆది నుంచి అంతం వరకూ తెలుసుకుందాం!

నిజానికి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు, పిరమిడ్ మాస్టర్లు, పిరమిడ్ ధ్యానులు వీళ్ళందరూ కూడానూ గత జన్మలలోనే అకుంఠిత సేవా దురంధరులు! సేవా చక్రవర్తులు!! సేవా తత్పరులు!!! కనుక, ఈ పిరమిడ్ ధ్యాన కేంద్రాలలో చేరిన మొదటిరోజు నుంచే అందరికి సేవ చేయమని చెప్తూంటాం!

"ఇవ్వాళ ధ్యానం నేర్చుకున్నావు కదా! ఇవాళ్టి నుంచే అందరికీ ధ్యానం చెప్పు" అని ప్రప్రథమంగా మొట్టమొదటిరోజే అందరినీ ఈ ఆధ్యాత్మిక శాస్త్ర సేవా కార్యక్రమంలో నిమగ్నం చేయిస్తారు పిరమిడ్ మాస్టర్లు. ఈ విధంగా, పిరమిడ్ మాస్టర్లు, గానీ పిరమిడ్ ధ్యానులు గానీ, మొట్టమొదటలోనే ఈ 'సేవ' యొక్క రూపు రేఖలు వాళ్ళు తెలుసుకుని ఉంటారు.

అయితే, కేవలం ఈ యొక్క "పిరమిడ్ మాస్టర్లే" కాదు, "పిరమిడ్ ధ్యానులే" కాదు, ప్రపంచం అంతటా కూడానూ ఈ 'సేవ' అనే కార్యక్రమం అనంతంగా జరుగుతూనే వుంది - అనేక రంగాల్లో, అనేక విధాలుగా, అనేక పద్ధతుల్లో, అనేక స్థాయిల్లో....!

**"సేవ!"**

అయితే, ఈరోజు మనం ఈ 'సేవ' అనే ఈ ఉదాత్తమైన విషయం గురించి అన్ని కోణాల్నుంచీ పరిశీలిద్దాం. అయితే ఈ అద్భుతమైన విషయం ఎలా ప్రారంభమైంది? మానవుని ఆత్మ యొక్క పరిణామ క్రమంలో, అది దాని యొక్క పరాకాష్ట ఎలా చెందింది? ఈరోజు ఈ విషయాలన్నీ కూలంకషంగా తెలుసుకుందాం.

'సేవ' అంటే- ఇది వ్యాపారానికీ, ఉద్యోగానికీ మరి మన కుటుంబ ధర్మానికీ విభిన్నమైనది.

ఉదాహరణకు, మనం కుటుంబంలో ఉన్నాం. "ఒక భార్య భర్తకు సేవ చేస్తోంది" అంటాం. కానీ, అది చాలా "కనీస స్థాయిలో ఉన్న సేవ"

అన్నమాట. భార్య భర్త దగ్గర నుంచి ఎన్నో పొందుతుంది. లబ్ధి పొందు తోంది. 'ఆ' సేవ చేస్తే కానీ 'ఆ' లబ్ధి పొందదు! అలాగే "భర్త భార్యకు సేవచేయడమనేది కూడా!". నేటి తల్లిదండ్రులు తమకు పుట్టిన పిల్లలకు సేవ చేయడమనేది, మరి పిల్లలు పెరిగిన తరువాత తల్లిదండ్రులకు సేవ చేయడమనేదీ- దీన్నంతటినీ కూడానూ మనం 'సేవ' అని అనడానికి.... చాలా జాగ్రత్తగా ఆలోచించి వాడాల్సిన పదమది! అంటే, చిన్నప్పుడు తల్లిదండ్రులు మనల్ని పెంచారు కనుక పెద్దవాళ్ళయ్యాక తిరిగి తల్లిదండ్రు లను బాగా చూసుకోవడం అన్నది "కనీసం ధర్మం" అవుతుంది గానీ- "అది కూడా ఓ సేవా కార్యక్రమం"గా అనుకోవడం మనం ఎంతో కష్టంగా ఒప్పుకోవాల్సిన విషయం.

## " 'ధర్మం' అన్నది వేరే! 'సేవ' అన్నది వేరే!"

వాస్తవానికి 'ధర్మం' అన్నది వేరే; 'సేవ' అన్నది వేరే! అలాగే 'కర్తవ్యం' అన్నది వేరే? 'సేవ' వేరే!

ఉద్యోగంలో మనం డబ్బు తీసుకుంటున్నాం. డబ్బు తీసుకుంటూ "ఉద్యోగం చేస్తున్నాం కాని 'సేవ' ఎక్కడ చేస్తున్నాం? జీతం డబ్బులు తీసుకుంటున్నాం. 'పది వేలు' , 'ఇరవై వేలు'. రూపాయలు తీసుకుంటు న్నప్పుడు - మనం చేస్తున్న పనికి జీతం ఇస్తున్నారు. ఇది సేవ ఎలా అవుతుంది?

ఒక కార్మికుడున్నాడు; పది బస్తాలెత్తుతాడు, వాడికి పది రూపాయలిస్తాం. అంటే, వాడు 'సేవ' చేసినట్టా? చేయనట్టా? వాడు 'పని' చేసాడు, 'పనికి తగ్గ ఫలితం' వచ్చింది. కార్మికుడు బస్తాలెత్తితే, "వాడు సమాజ సేవ చేసాడు" అని అంటామా? అనం! మరి ఈ కంపెనీ ఛైర్మన్ కూడా తాను ఉద్యోగం చేసాడు, తనకేదో కావాల్సిన లాభాలేవో పొందాడు, మరి దాన్ని 'సేవ' అని ఎలా అంటాం?

కార్మికుడు పది బస్తాలు మోసి, పది రూపాయలు సంపాదించు కోవడం ఎలాగో, అలాగే ఒక యూనివర్శిటీ ప్రొఫెసర్ తన బుద్ధిని ఉపయోగించి పనులు చేస్తున్నాడు - నెలకు పదివేల రూపాయలు పొందు తున్నాడు. అంటే, ఎవరికి తగిన కష్టం వాళ్ళు చేసి వాళ్ళ కష్టాన్ని వాళ్ళు సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, బస్తా మోస్తే కొంచెమే సొమ్మొస్తుంది. మరి యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా పని చేస్తే మరి కొంచెం ఎక్కువగా

సామ్మొస్తుంది. మరి అలాంటప్పుడు వారిని "సేవ చేస్తున్నారు" అని అనడం ఏం సబబు? భార్య భర్తకు సేవ చేస్తుంది; కాళ్ళు పిసకటం లాంటి సేవ చేస్తుంది. అయితే పక్కింటి వాళ్ళకి ఎవరికో సేవ చేస్తే అది 'సేవ' అవుతుంది. కానీ, మన మొగుడికి మనం సహాయం చేస్తే, మన భార్యకు మనం సహాయం చేస్తే, మన పిల్లలకు మనం సహాయం చేస్తే, మన తల్లిదండ్రులకు మనం సహాయం చేస్తే అది 'సేవ' అని మాత్రం అనిపించుకోదు- అది మన ధర్మం, కర్తవ్య నిర్వహణ! మనవారికి మనం చేసేది ధర్మ నిర్వహణ, కర్తవ్యనిష్ట అవుతుందే కాని, మరి సేవా ధురంధరతా, మరి సేవా తత్పరతా ఎలా అవుతుంది? "కాదా?' అంటే, "కాదు" అని కాదు! "అవుతుంది" కానీ "కనీస పక్షంలో వుంది" అని అర్థం చేసుకోవాలి.

## డబ్బులు తీసుకోకుండా........!

మా తండ్రిగారు అంటూండేవారు. "నేను గవర్నమెంట్ 'సర్వీస్' చేస్తున్నానురా!" అని. కానీ నాకు, చిన్నప్పడే, అప్పట్లోనే అది "పూర్తి సమంజసం" గా అనిపించలేదు- "నువ్వు గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నావు. నువ్వు డబ్బులు తీసుకోకుండా రోజూ ఏదో ఓ మంచి పని చేస్తూ వుంటే ఇంటికేం డబ్బులు తీసుకోకుండా, వాళ్ళు తమంతట తాముగా ఇచ్చిందే తీసుకుంటూ - అదీ 'సేవ' అంటూండేవాడిని.

సేవకూ ప్రతిఫలం ఉంటుంది. ఉదాహరణకు మనం ఫ్రీగా మునిసిపాలిటీ రోడ్లన్నీ ఊడుస్తున్నాం. పొద్దున్నే లేస్తున్నాం. రోడ్లన్నీ చకచకా ఊడ్చాం, సాయంత్రానికి తిరిగి వచ్చేసాం. ఎవరైనా దయతలచి వాళ్ళింటికి భోజనానికి పిలిచి, కాఫీ ఇచ్చి, టిఫిన్ ఇస్తే అది తీసుకుంటున్నాం- అప్పడు మనం చేసేది 'సేవ' అనిపించుకుంటుంది. అలా కాకుండా మనం మునిసిపాలిటిలో నెలకు పదివేల రూపాయలు జీతం తీసుకుంటూ రోడ్లన్నీ ఊడిస్తే అది ఒక ఉద్యోగమే కానీ, సర్వీస్ కాదది. కనుక, మా తండ్రిగారు చిన్నప్పటి నుంచి "నేను గవర్నమెంట్ సర్వీస్ చేస్తున్నాను" అని అంటూ వుంటే నాకు చాలా నవ్వులాటగా వుండేది! ఆయనేదో గొప్పగా ఫీల్ అయ్యేవాడు. "నేను సర్వీస్' చేస్తున్నాను కదా! " అని.

"సర్వీస్ నుంచి రిటైర్ అయ్యాను" అంటాం. 'సర్వీస్' నుంచి రిటైర్ కాలేదు; ఉద్యోగం నుంచి మనం రిటైర్ అయ్యాం. సర్వీస్ ఎక్కడ చేసాం? 30 సంవత్సరాలు 'గవర్నమెంట్ సర్వీస్' కాదు, 'గవర్నమెంట్

ఉద్యోగం ' చేసాం. కానీ అందరూ 'గవర్నమెంట్ సర్వీస్' అంటారు. అదేమిటో, చిన్నప్పుడు నాకర్థం కాలేదు; మింగుడు పడలేదు!

## "ధర్మం చేస్తే ప్రత్యేకమైన గుర్తింపు లేదు!"

తల్లిదండ్రుల సేవేమిటి? అది మన కర్తవ్యం! అది సేవేమిటి? వాళ్ళు మనకెంత చేసారో చిన్నప్పుడు, మనమిప్పుడు వాళ్ళకిస్తున్నాం, మనం వాళ్ళ దగ్గర నుంచి ఎంత పొందాం? అంతే వాళ్ళకందిస్తున్నాం. మరి మనం చిన్నపాపగా ఉన్నప్పుడు, మనం చేతకాని వాళ్ళమైనప్పుడు, మనలను వాళ్ళు పెంచి, పెద్ద చేసారు కదా, దానికి గాను వాళ్ళకు చేతకానప్పుడు మనం వాళ్ళను చూసుకుంటున్నాం; అంతే! ఇందులో కనీసపు సేవ ఉన్నట్టు కనబడుతుందే కానీ, 'సేవ' అన్న పదానికి, దానికో ఉదాహరణగా తీసుకోవడానికి ఎక్కడా అవకాశమే కనబడదు- అది మన కర్తవ్యం! వాళ్ళ దగ్గర పుట్టాం, వాళ్ళను చూసుకోవాలి- అది మన ధర్మం. చూసుకోకపోతే అది 'అధర్మం'; చూసుకుంటే అది పెద్ద 'సేవ' కాదు. అధర్మం చేస్తే - అది పాప కార్యక్రమం - మరి దానికి తగిన శిక్ష ఉంటుంది! కానీ, మన ధర్మం మనం నిర్వర్తిస్తే దానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉండడం అసంభవం. అధర్మం చేస్తే ప్రత్యేకమైన శిక్ష ఉంది కానీ, మన ధర్మం మనం నిర్వర్తిస్తే దానికి ప్రత్యేకమైన పురస్కారం ఏమీ లేదు!

## "'సేవ' చేస్తే పురస్కారముంటుంది!"

'సేవ' చేస్తే పురస్కారముంటుంది. మన తల్లిదండ్రులనే కాకుండా పక్కింటి వాళ్ళ తల్లిదండ్రులను కూడా చూసుకుంటే, ప్రక్కింటి ముసలి వాళ్ళను చూసుకుంటే- అదీ సేవ. మన పిల్లలకు మనం చదువుచెప్పినట్లే. ప్రక్కింటి పిల్లల్ని కూడా మన దగ్గర చేర్చుకుని వాళ్ళందరికీ చదువులు చెప్పిస్తే అదీ సేవ. ట్యూషన్ ఫీజు తీసుకోకూడదు. ట్యూషన్ ఫీజ్ తీసుకుంటే అది మళ్ళీ 'వ్యాపార'మవుతుంది. వాళ్ళందర్నీ పిలుచుకున్నాం. ట్యూషన్ ఫీజు తీసుకున్నాం. నెలకు వంద రూపాయలు తీసుకుంటున్నాం. బస్తాలు మోసే వాళ్ళు, బస్తాలు మోసి డబ్బులు తీసుకున్నట్లు, మనం ట్యూషన్ చెప్పి డబ్బులు తీసుకుంటున్నాం. ఇదంతా 'సేవ' కాజాలదు కదా! అయితే పక్కవా ళ్ళ పిల్లలందరికీ కూడా డబ్బులు తీసుకోకుండా చదువు చెప్తే అది 'సేవ' అవుతుంది. మన పిల్లలకు మనం చదువు చెప్తే అది 'సేవ' ఎలా అవుతుం ది? మన పిల్లలకు చదువు చెప్పవలసిన ధర్మం, కర్తవ్యం మనకు ఉంది.

కనుక, ఎక్కడైతే ధర్మం, కర్తవ్యం ఉందో అక్కడ వాటిని నిర్వర్తిస్తూ వుంటే మనల్ని ధర్మపరాయణులంటారు. కర్తవ్యనిష్టులంటారు. కానీ సేవాపరాయణులని ఎలా అంటారు? కానీ, అదే చాలా గొప్పై పోయింది ప్రజల్లో. "తల్లిదండ్రులకి సేవ చేస్తున్నాడు" అంటారు.... రామచంద్రా! తల్లిదండ్రులకు సేవ చేయడం మన యొక్క కనీస ధర్మం!

## 'అతిధి సేవ' ఉంది!

'అతిథి సేవ' అనేది వుంది - అది కరెక్ట్. ఎవరో అతిధి, అభ్యాగతులు వస్తారు. రాత్రి పూట వస్తారు, వాళ్ళ కెక్కడా నుంచోడానికి నీడ లేదు. వాళ్ళకు ఓ రాత్రిపూట చోటివ్వడం, కాఫీ ఇవ్వడం, వాళ్ళడిగింది, మనం ఇవ్వగలిగిందీ ఇవ్వడం- ఇక్కడ 'అతిథి సేవ' ఉంది. అయితే, 'తల్లిదండ్రుల సేవ' అనేది ఎక్కడా లేదు.

## "తల్లిదండ్రుల సేవ" అన్నది లేనే లేదు!

కానీ, మూర్ఖులు "మేము తల్లిదండ్రులకు సేవ చేస్తున్నాం" అంటారు. రామచంద్రా!! తల్లిదండ్రులకు సేవ చేయడమనేది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లకు మింగుడు పడని విషయం. కనుక, ఎక్కడైతే ప్రతిఫలం లేదో, అక్కడ మనవాళ్ళు కాని వాళ్ళకు మనం సేవ చేయడం అనేది, అది 'సేవ' చేయడం అవుతుంది కానీ, మన వాళ్ళయిన వాళ్ళకు చేసే సేవ అది సేవ అనిపించుకోదు - అది మన యొక్క ధర్మం. అది చెయ్యకపోవడం అధర్మం. ఈ 'సేవ' అన్న పదాన్ని ముఖ్యంగా 'తల్లిదండ్రుల సేవ' అని చెప్పేసి అదేదో పెద్ద నీతిబోధ లాగా చెప్తారు. నేను చిన్నప్పటినుంచీ అదే విన్నాను. " తల్లిదండ్రుల సేవ' చేయాలి" అని చెప్పేసి.

## " 'గురు సేవ' అన్నది కూడా లేదు!"

కనుక, మై డియర్ ఫ్రెండ్స్! 'తల్లిదండ్రుల సేవ అనేది లేనే లేదు! అలాగే 'గురుసేవ' అనేది కూడా లేనే లేదు! గురువు దగ్గర నుంచి విద్య అభ్యసించాం, గురువు కాళ్ళు పిసికితే, గురువుకు ఏదైనా తీసుకెళ్ళి ప్రతిఫలం చూపెడితే అది 'గురు సేవ' ఎలా అవుతుంది? గురువు ఎంత చేశాడు మనకు? మనం ఎంత చేస్తున్నాం? అది 'సేవ' కానే కాదు. 'తల్లిదండ్రుల సేవ' లేదు, 'గురుసేవ' లేదు. అతిథి మనకేమీ ఇవ్వలేదు. మనం ఆ అతిథి నుంచి ఏమీ తీసుకోలేదు. ఆ అతిథికి ఏమిచ్చినా అది సేవే!

## “ప్రతిఫలం తీసుకుంటే వ్యాపారమే!”

మై డియర్ ఫ్రెండ్స్! పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు అందరికీ ‘ధ్యాన విద్య’ నేర్పిస్తున్నారు; కానీ వాళ్ళ దగ్గర నుండి ప్రతిఫలం తీసుకోరు. ఫీజు తీసుకుంటే మళ్ళీ అది ‘వ్యాపారం’ అవుతుందే కానీ ‘సేవ’ కాజాలదు. గురువు ‘సేవ’ చేస్తాడు. గురువు సేవ చేసేవాడే కానీ గురువుకు సేవెక్కడా లేదు. గురువన్నవాడు సేవాతత్పరతతో, సేవాదురంధరతలో ఉన్నవాడు. వాడు ఎవ్వడి దగ్గరకూ వెళ్ళి ఎవరి నుంచీ ఏమీ ఆశించడు. గురువులకు మన అంతట మనమే ఇస్తున్నాం.

## “దక్షిణ కోరేవాడు గురువు కాదు!”

కనుక, అతను వ్యాపారం చేసినట్లు “నేనిలా చేసాను కనుక, నీవలా చెయ్యాలి” అంటూ చివరలో ఈ యొక్క ‘గురుదక్షిణ’ అడగడం అనేది గురువు యొక్క లక్షణమే కాదు! మొట్టమొదట ఇస్తేనేం? చివరిలో ఇస్తేనేం? దక్షిణ కోరేవాడు గురువు కానేకాడు! వాడు వ్యాపారి! పెట్టుబడి పెట్టాడు. “నేను ఇన్ని రోజులు నేర్పించాను; కనుక, నువ్వు నాకు అవన్నీ చెయ్యాలి” అని ద్రోణుడు, అర్జునుణ్ణి తాను పెట్టిన పెట్టుబడికి ప్రతిఫలం అడిగాడు. “నువ్వ నా యొక్క శత్రువును సంహరించాలి. నాకు చిన్నప్పటి నుంచి, అదే - ఆ ద్రుపదుడున్నాడే - వాడు నా శత్రువు. వాడిని నేను చంపజాలను; నాది బ్రాహ్మణ ధర్మం. శత్రువును చంపాలి. కనుక నిన్ను పెంచి పోషిస్తున్నాను. నువ్వు వాణ్ణి చంపాలి.” చూసారా! అంటే ఇక్కడ గురువు తన దక్షిణ అడిగాడు, ప్రతిఫలం అడిగాడు అది గురుధర్మం కానే కాదు.

ఇక్కడ ఓ వృత్తిలో ఉన్నాడు ద్రోణాచార్యుడు. కానీ ‘సేవ’ చేయలేదు. సేవ చేసేవాడే గురువు. సేవాతత్పరుడే, సేవాధురంధరుడే గురువు. ఏ ప్రతిఫలమూ ఆశించనివాడు. కృష్ణుడు భగవద్గీతంతా చెప్పాడు. అర్జునుడికి చెప్పి, “నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు చెయ్యవయ్యా!” “యథేచ్ఛసి తథా కురు!” అన్నాడు. చెప్పవలసిన ధర్మం కూడా లేదు. చెప్పవలసిన ధర్మమే లేదక్కడ. ఎవడెట్టాపోతే కృష్ణుడికెందుకు? కానీ ఆయన తన సేవ చేసాడు. ఆయన సేవాతత్పరుడు, సేవాధురంధరుడు.

## “గోపీజన పరివేష్టి”

కృష్ణుడికి 16,000 మంది గోపికలు! అంటే అంతమంది గోపికలు

ఆయన చుట్టూ ఎందుకు చేరారు? అంటే ఆయన ఏమైనా 'సెక్స్' చేసాడా? ఏ ఆడదీ ఒక్కళ్ళతో మించి ఎక్కువ సెక్స్ చేయదు. కానీ వాళ్ళెందుకు కృష్ణుని చుట్టూ చేరారు? కృష్ణుడు ప్రతి ఒక్కరినీ ఆ చెట్టుక్రింద కూర్చోపెట్టీ, ఈ చెట్టుక్రింద కూర్చోపెట్టా, ధ్యానం నేర్పించేవాడు!

అంతకుముందు జన్మలో మునులందరూ కూడానూ, ఈ జన్మలో గోపికలై కృష్ణుని దగ్గర చేరారు! అంటే, మునులంటే - వాళ్ళు మౌనంలో పరాకాష్ఠ సంపాదించారు! కానీ 'ధ్యానం' సరిహద్దు దాకా ఇంకా పోలేదు. శ్రీకృష్ణుడు వాళ్ళందరికీ ధ్యానం నేర్పించేవాడు! వాళ్ళందరికీ, మూడో కన్ను గురించి నేర్పించాడు! కనుక ఆ మునులందరూ గోపికలుగా మారి కృష్ణుడి శిక్షణలో ఋషులయ్యారు. 16,000 మంది గోపికలు తయారై, 16,000 మంది ఋషులుగా తయారయ్యారు. ఈ యొక్క యోగీశ్వరుడి దగ్గర! చూసారా, ఆయన ఎంతమందికి సేవ చేసాడో! కనుకనే, మరి 'గోపీజన పరివేష్ఠి".

## "ధ్యానవిద్య నేర్చుకుని ఋషులు అయ్యారు!"

'గోపాలుడు', అంటే 'ఇంద్రియాల్ని పరిపాలించే వాడు'. 'గోపీజనం' అంటే తాము కూడా తమ తమ ఇంద్రియాలను వశపరచుకునే ఆ యొక్క మార్గంలో ఉండేవాళ్ళే గోపికలు. 'గోపీజన పరి వేష్టితుడు' అంటే, యోగదర్శన సామ్రాజ్యంలో ప్రవేశించడానికి అందులో ఉత్తీర్ణులు కావడానికి ఎవరైతే ఉద్యుక్తులౌతారో వాళ్ళందరూ కృష్ణుడి చుట్టూ చేరారన్నమాట. వాళ్ళందరికీ కృష్ణుడు 'ధ్యాన విద్య' నేర్పించాడు! అంతకు ముందు వారు 'మౌనవిద్య' నేర్చుకున్నారు- 'మునులు' అయ్యారు. మరి కృష్ణుడి దగ్గర వాళ్ళందరూ చేరి ధ్యానవిద్య నేర్చుకుని, ఋషులు అయ్యారు. చూసారా! 'గోపీజన పరివేష్ఠితుడు' అంటే - అదీ అర్థం. కానీ మన వాళ్ళు దాన్ని 'సెక్స్‌పరం'గా తీసుకుని..రామచంద్రా!

ఒకసారి ఏమైందంటే, ఒకావిడ నదిని దాటాలి; నది చాలా ఉధృతంగా పొంగిపొరలుతుంది. "నదిని దాటడానికి ఏం చేయాలి?" అని శ్రీకృష్ణుణ్ణి అడిగితే, "కృష్ణుడే కనుక బ్రహ్మచారి అయితే నది దారి ఇచ్చు గాక" అని చెప్పు ; నేను బ్రహ్మచారినైతే నది దారిస్తుంది" అన్నాడు. అంటే, చూసారా! కృష్ణుడు బ్రహ్మచారి ఎలా అవుతాడు? అంతమంది స్త్రీలతో ఉంటే! 'బ్రహ్మచారి' అంటే 'బ్రహ్మజ్ఞానంలో చరించేవాడు; బ్రహ్మతత్వంలో

అనుక్షణం ఉండేవాడు. కనుకనే, వెంటనే ఆ యొక్క యమున చీలింది- మరి దారిచ్చింది!

అటువైపు దుర్వాసుడున్నాడు. ఆ దుర్వాసుడికి భోజనం పెట్టి తిరిగి వస్తూంటే నది దాటడం మళ్ళీ సమస్య అయితే, "ఏం చెయ్యాలి? అని దుర్వాసుడిని డిగితే "దుర్వాసుడికే కనుక కోపం వుంటే నది చీలకుండా ఉండుగాక? కోపం లేకపోతే నది చీలుగాక" అనమన్నాడు. దుర్వాసుడంటే కోపానికి ప్రతీక. కోపం ఎందుకొస్తుంది? "ప్రక్కవాడిని బాగుచేయాలి" అనే తీవ్రతపన ఉన్నప్పడే తీవ్ర కోపం! లేకపోతే, ఎవడు ఎటు పోతే మనకెందుకట? పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లందరికీ ఈ బ్రహ్మర్షి పత్రీజీ గారి యొక్క కోపం" చాలా అనుభవం ఉంది. "ఈయన నిత్య కోపిష్టి అబ్బా! దుర్వాసుడి లాగా!" అంటారు. కానీ, ఆవిడ దుర్వాసుడు పేరు తలచుకుని ఆ మంత్రం చేస్తే ఆ యమున చీలిపో యింది. చూసారా! అంటే కృష్ణుడు ఎంతటి బ్రహ్మచారో మరి దుర్వాసుడు అంతటి కోపిష్టి!

## 'సేవ' అన్నది ఎప్పుడు మొదలవుతుంది?

మై డియర్ ఫ్రెండ్స్ ! 'సేవ' అన్నది ఒకానొక ఆత్మ యొక్క చరిత్రలో ఎన్నో జన్మల తరువాత మొదలవుతుంది. మొట్టమొదటలో వాడు తన సంగతి తాను చూసుకుంటూ, తన తిండీ, తన త్రాగుడూ, తన నిద్రా తన సొంత భోగాలలోనే కొట్టుకుపోతుంటాడు. అంటే, తమోగుణంలో కొట్టుకు పోతుంటాడు. తరువాత రజోగుణంలో, "అంతా నాకిందే పనిచేయాలి!" నేనే రాజుగా కావాలి!" ఈ రకంగా కొన్ని జన్మలు కుంభకర్ణుడిలా, మరి కొన్ని జన్మలు రావణాసురుడిలా వుంటే, రావణాసురుడెక్కడ 'సేవ' చేసాడు? వాడు తాగి తందనాలాడి పడుకోవడం తప్పితే?

ఆరు నెలలు తినడమూ, ఆరు నెలలు పడుకోవడమూ! కుంభ కర్ణుడి జీవితంలో 'సేవ' ఎక్కడుంది? రావణాసురుడి జీవితంలో 'సేవ' ఎక్కడుంది? అంటే ఏమిటి? ప్రతి ఆత్మ కూడానూ, మొత్తం వంద జన్మలున్నాయనుకోండి. 30జన్మలు తమోగుణంలోనూ, 30 జన్మలు రజోగుణం లోనూ పోతాయి. అరవైశాతం జన్మలు 'సేవ' లేకుండానే పోతాయి. తరువాత 30/40 శాతంలోనే మరి ఈ 'సేవా కార్యక్రమం' మొదలవుతుంది.

## “సాత్విక గుణ ప్రధానమొచ్చినప్పుడు!”

సాత్విక గుణ ప్రధానమొచ్చినప్పుడు - అప్పుడు 'సేవ' మొదలవుతుంది. అప్పడు వాళ్లేం చేస్తారంటే, ఇంట్లోనే ఉంటూ తమ పనులన్నీ తాము చూసుకుంటూంటారు! తమ మధ్యాహ్నం సమయంలో పక్కింటివాళ్లతో ముచ్చట్లు పెట్టకుండా మరి వాళ్లకు ఏదో సహాయం చేస్తుంటారు. పక్కింటికెళ్లి ముచ్చట్లు పెట్టుకుంటే అక్కడ 'సేవ' ఏమీ లేదు. అంటే మన యొక్క 'ముచ్చట' తీర్చుకుంటున్నాం. ఏదో గప్పాలు కొట్టుకుంటున్నాం. కానీ ఆ మధ్యాహ్న సమయంలో పక్కింటి పిల్లలకు మరి ఇంగ్లీషు నేర్పించటమో, లెక్కలు నేర్పించటమో, సంగీతం నేర్పించటమో, మరి చుట్టుపక్కలింటికెళ్లి ముసలి వాళ్లుంటే వాళ్లకి కాస్త మాటలు చెప్పడం. ఇలా 'సేవా' కార్యక్రమం - అలా మొదలవుతుంది సాత్విక గుణ ప్రధానంలో.

అంటే ఏంటి?మన ఇంట్లో పనులుంటే బయటకు వెళ్లం! ఇంట్లో పన్లేమీ లేనప్పడు బయటకు వెళ్లి కాస్త సేవా కార్యక్రమం చేస్తూంటాం. మళ్లీ బయటకెళ్లి డబ్బు సంపాదించాలని ఏమాత్రం వుండదు. అయితే, సేవా కార్యక్రమం చేస్తున్నప్పడు, మనం ఇంట్లో చాలా అవమానాలకు గురి అవుతాం. “ఏమయ్యా? ఊరికే పోయి వాళ్లకి, వీళ్లకీ పిచ్చిగా ఏదో చెప్పే బదులు, కొంత వ్యాపారం చేస్తే ఇంకో మూడు లక్షలొస్తాయి కదా? ఇంటికి మూడు ఫ్రిజ్‌లూ, మూడు ఎ.సి రూములు వస్తాయి కదా!” అంటారింట్లోవాళ్లు. కానీ సాత్విక గుణ ప్రధానులకు అవన్నీ గత జన్మలో అయిపోయాయి. ఇప్పడు ప్రక్కవాడికి మంచి చేస్తే, వాడికి సహాయం చేస్తే, వాడి మొహంలో కనపడే ఆనందం వీడికెంతో ఆనందాన్ని ఇస్తుంది.

## “సేవలే తృప్తినిస్తాయి!”

కనుక, ఆ చిన్ని, చిన్ని సేవలే మనకెంతో తృప్తినిస్తాయి. అంతకు ముందు మరి ఎన్నడూ లేనంత తృప్తి మన జీవితంలో మొదలవుతుంది. **'సేవ' ఎక్కడుందో అక్కడ తృప్తి వుంటుంది. ఎక్కడ 'సేవ' లేదో అక్కడ తృప్తి అనేది మృగ్యం.** అక్కడ అసంతృప్తి రాజ్యమేలుతుంది. 'తృప్తి' అనేది మనిషికి సేవ నుంచే ప్రారంభమవుతుంది. ఆ తృప్తి కోసం 'సేవ' చేస్తూంటామన్న మాట.

సంఘ సేవికులున్నారు - సంఘసేవ చేసే వాళ్లు. వాళ్లేమీ ఆశిం

చరు. కానీ ప్రొద్దునే పోయి ఏదో రోడ్లూడుస్తుంటారు. లేకపోతే ఏదో చెట్లు నాటుతుంటారు. ఎక్కడికైనా పోయి ఫ్రీగా ఎడ్యుకేషన్ ఇస్తుంటారు. అప్పుడు వాళ్లకు ఆ తృప్తి ఉంటుంది. వాళ్ళు మనకేమీ ఇవ్వలేరు. ఫలం కూడా ఇవ్వలేరు. కానీ వాళ్ల మొహంలో సంతోషం, అది మనకు ఎంతో ఆనందం, వాళ్ల మొహంలో ఆనందం మనకెంతో తృప్తి.

**"ఎంత తృప్తో చెప్పనలవి గాదు!"**

మై డియర్ ఫ్రెండ్స్! 'సేవ' అన్నదే తృప్తినిస్తుంది. ఇది ఎంత తృప్తి నిస్తుందో చెప్పనలవి కాదు. మదర్‌థెరిస్సా ఉందనుకోండి. మరి ఆవిడ ఎంత సేవ చేసింది! ఆవిడ ఎంత తృప్తి అనుభవించి వుంటుంది? కలకత్తా లో ఎంత నికృష్టమైన జీవితం రోడ్ల మీద గడుపుతూంటారు. రోడ్డు మీద కని పారేయబడిన వాళ్ళు! వాళ్లను ఎక్కడికో తీసుకెళ్లి అన్నం పెట్టి, బట్టలిచ్చి, వాళ్లకు చదువు నేర్పించి, ఆవిడ ఎన్ని విద్యాసంస్థలు స్థాపించిం దో మరి చూసారా! ఆవిడ సేవా చక్రవర్తి! మన ఇంట్లోనే మన పనులు మనం చేసుకుంటూ మన ఖాళీ టైమ్‌లో 'సేవ' చేయడం ఒక ఎత్తైతే మరి జీవితాన్నంతా సేవకంకితం చేయడమనేది, అదే సేవా ధురంధరత్వం.

**"సేవా చక్రవర్తి!"**

మహాత్మాగాంధీ! ఆయన తన పిల్లల్ని పట్టించుకోలేదు. ఎప్పుడైనా ఆయన పిల్లల గురించి మనం విన్నామా? ఆయనకు ఐదు మంది పిల్లలు అనే విషయం ఎప్పుడో చదువుకొనుంటాం. మనం మరిచిపోయాం. మనం మహాత్మాగాంధీ భార్య కస్తూరిబా అనీ, పిల్లలు ఫలానా అనీ ఇవన్నీ మర్చిపోయాం- ఆయన సేవా చక్రవర్తి!

మరి నెల్సన్ మండేలా ఉన్నాడు, ఆయన ఎన్ని సంవత్సరాలు కారాగారంలో మగ్గాడు - "ఎందుకు తెల్లవాళ్ల జులుం నల్లవాళ్ల మీద ?!" అని! అలాగే మార్టిన్ లూథర్ కింగ్ ఉన్నాడు, చంపేసారాయన్ని. ఈ సేవ చేసేవాళ్ళందర్నీ చంపేస్తారండోయ్! చంపడానికీ, చావడానికి భయపడేవాళ్ళు సేవలో ముందంజ వేయలేరు. చావడానికి భయపడని వాళ్లే సేవలో ముందుంటారు.

**"సేవ చేయడం తేలిక కాదు!"**

మై డియర్ ఫ్రెండ్స్! సేవ చేయడమనేది అంత తేలికైన విషయం కాదు. అది ఎంతో కష్టమైన విషయం. దానికి అవమానాలన్నింటినీ

సహించాలి. ప్రాణభయం ఉండకూడదు. అలాంటివాళ్ళే సేవతత్పరులు కాగలరు! వారే 'సేవా దురంధరులు' కాగలరు!! వారే 'సేవా చక్రవర్తులు' కాగలరు!!

## "పిరమిడ్ మాస్టర్లు!"

పిరమిడ్ మాస్టర్లందరూ 'సేవా చక్రవర్తులూ, సేవా దురంధరులూ', 'సేవా తత్పరులూ', అయితే మదర్‌థెరిస్సాకీ, మహాత్మాగాంధీకీ, మరి నెల్సన్ మండేలాకీ, మార్టిన్ లూథర్ కింగ్‌కీ- వీళ్ళందరికీనూ, మరి పిరమిడ్ మాస్టర్స్‌కీ తేడా ఏమిటి? అంటే, ఓ... యబ్బ! చాలా ... తేడా వుంది!

ఈ 'సేవ' అనేది తమోగుణం అయిపోయిన తరువాత రజోగుణం అయిపోయిన తరువాత, సాత్వికగుణ ప్రధానంలో మొదలవుతుంది.

## "వ్యక్తిత్వం యొక్క పరాకాష్ట!"

ఉదాహరణకు గోదావరి నది ఉందనుకోండి, నాసిక్‌లో 'త్రయంబకేశ్వరం' దగ్గర బొట్టు బొట్టుగా ప్రారంభమై మెల్లిమెల్లిగా, మెల్లి మెల్లిగా ప్రవాహంలా కొనసాగి, మరి 'రాజమహేంద్రవరం' వచ్చేసరికి మహాసముద్రంలా తయారౌతుంది. అలాగే ఈ 'సేవ' కూడానూ. ఈ సాత్వికగుణం ప్రధానం, అంటే నూటికి 60 జన్మలు తమో, రజోగుణాల్లో అయిపోయిన తరువాత మిగతా నలభై జన్మల్లోని మొట్టమొదటి జన్మలో ఈ 'సేవ' అన్నది బొట్టు బొట్టుగా మొదలై చివరి జన్మకొచ్చేసరికి ఓ పెద్ద బుద్ధుడులాగా, కృష్ణుడిలాగా, జీసస్ క్రైస్ట్ లాగా తయారవుతాం. అంటే, అక్కడ సముద్రంలో లీనమవుతుంది. 'సేవాతత్పరులు'గా, 'సేవా దురంధరు లు'గా, 'సేవా చక్రవర్తులు'గా ఆ ఆత్మ యొక్క ఆ వ్యక్తిత్వం అక్కడ పరి సమాప్తం అవుతుంది. అక్కడ పరాకాష్టను చెందుతుంది.

## "సేవా దృక్పథం లోనే పుట్టాను!"

నేను కూడా చిన్నప్పటి నుంచి 'సేవ' అనే దృక్పథం ఉన్నవాళ్ళింటి లోనే పుట్టాను. 'సేవాతత్పరులు కారు కానీ 'సేవదృక్పథం' ఉంది. తమ తమ పనులు చేసుకుంటూ మిగతా వాళ్ళందరికీ సహాయం చేయడం అన్నమాట! మా అమ్మగారందరికీ సహాయం చేసేవారు. మా తండ్రి గారందరికీ సహాయం చేసేవారు; మా అన్నగారు అందరికీ సహాయం చేసేవారు; నేనూ అందరికీ, వచ్చిన వాళ్ళందరికీ నాకు తెలిసినంత ప్రాపంచిక విద్య నేర్పిస్తూ ఉండేవాడిని - డబ్బు సమస్య లేదక్కడ. మనం

నేర్చుకుంటాం. అందరికీ నేర్పిస్తుంటాం. మనం తింటాం. అందరికీ తినిపిస్తాం ఉన్నదాంట్లో. అది కనిష్ట స్థాయిలో, మినిమమ్ లెవెల్లో ఉండే సేవా దృక్పథం. సేవా 'తత్పరత' కాదు - సేవా 'దృక్పథం.

## ధ్యానంలో ప్రవేశించిన తరువాత.......

మెల్లిమెల్లిగా ఏమయింది? నేను ఈ యొక్క ధ్యానంలో ప్రవేశించిన తరువాత, మరి కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే మిగతా సమయాన్నంతా ఆధ్యాత్మిక శాస్త్ర శిక్షణ ఇవ్వడం కోసమే ఉపయోగించడం మొదలుపెట్టాను. అంటే నా పెళ్ళాం బిడ్డలను చూసుకుంటూ, నా ఉద్యోగ ధర్మం చూసుకుంటూ, మిగతా ప్రతిక్షణం కూడానూ మరి "అందరికి ధ్యానం నేర్పించాలి, అందరికీ ఆత్మజ్ఞానం నేర్పించాలి" అని చెప్పేసి - దాన్ని ఏమంటారు? 'సేవా తత్పరత' అంటారు!

మరి 1992లో నేను ఉద్యోగ ధర్మం కూడా వదిలి పెట్టేసి మొత్తం సమయం, నూటికి నూరుపాళ్ళు, రోజుకి 24గంటలూ 'సేవ' కోసమే వినియోగిస్తున్నాను. దీన్ని 'సేవా చక్రవర్తిత్వం' అంటారు. చూసారా, మూడు స్టేజ్‌లుంటాయి సేవలో.

1. 'సేవా దృక్పథం'లో ప్రవేశించిన వాళ్ళు - అంటే, సేవ అన్నది కనీస స్థాయిలో వున్నవాళ్ళు.
2. 'సేవా తత్పరు'లైన వాళ్ళు - అంటే, సేవ అన్నది మాధ్యమిక స్థాయిలో వున్నవాళ్ళు.
3. 'సేవా చక్రవర్తు'లైన వాళ్ళు - అంటే, సేవ అన్నది అత్యున్నత స్థాయిలో వున్నవాళ్ళు.

మినిమమ్ లెవెల్, మిడిల్‌లెవెల్, మరి మాగ్జిమమ్ లెవల్లో ఉండేవాళ్ళు, అత్యున్నత శ్రేణిలో ఉండేవాళ్ళు.

## "ప్రాపంచిక సేవ తరువాత ఆధ్యాత్మిక సేవ!"

మై డియర్ ఫ్రెండ్స్ ! ఈ 'సేవ' అనే కాన్సెప్ట్‌లో ఉన్నప్పుడు, 'ప్రాపంచిక సేవా' ఉంది. 'ఆధ్యాత్మిక సేవా' ఉంది. ప్రాంపచిక సేవలో, 'దృక్పథం'లో ఉన్నవాళ్ళున్నారు. అందులో 'తత్పరులు' అయిన వాళ్ళున్నారు. మరి ప్రాపంచిక సేవలో 'చక్రవర్తులు' అయిన వాళ్ళూ ఉన్నారు - మహాత్మాగాంధీ లెవెల్లో, ఇంతకుముందు చెప్పిన- ఆ పై నలుగురూ ప్రాపంచిక సేవలో మరి పరాకాష్టలో, ఎవరెస్టు శిఖరంలో ఉన్నవాళ్ళు.

ఈ ప్రాపంచిక సేవంతా అయిపోయిన తరువాత, అప్పుడు ఆధ్యాత్మిక సేవ మొదలవుతుంది. ప్రాపంచిక సేవనే 'కర్మయోగం' అంటాం. 'యోగపరంపర' కాన్సెప్ట్‌లో కర్మ యోగం మొదటిభాగం ఉందే అదంతా ఇందులోకి వస్తుంది.

ఇక్కడ 'కర్మయోగం - (1) ను మరొక్కసారి పునశ్చరణ చేసుకుందాం.

**"కర్మయోగం - (1)**

"యోగపంరంపర" లో మనం మొట్టమొదటగా "కర్మయోగం - మొదటిభాగం" గురించి తెలుసుకుందాం.

కర్మయోగం - మొదటిభాగంలో నాలుగు స్టేజ్‌లు ఉన్నాయి. నాలుగు దశలు వున్నాయి. వీటిని మనం

(1) స్టేజ్ - A (2) స్టేజ్ - B

(3) స్టేజ్ - C (4) స్టేజ్ - D అని తెలుసుకున్నాం.

**"చెడు చేయొద్దు!"**

స్టేజ్ - A గురించి చెప్పాలంటే, "అయ్యా నువ్వు ఎవరికీ మంచి చేయలేకపోతే చేయొద్దు. చెడు మట్టుకు చేయొద్దు నాయనా! ఏ ప్రాణినీ హింసించవద్దు నాయనా! ఆ రొయ్యని ఇన్ని రోజులూ తిన్నావ్, ఇంక తినొద్దోయ్! ఆ పందిని తిన్నావు ఇన్ని రోజులూ, ఇంక తినొద్దయ్యా! నీ పెళ్ళాంతో ఇన్నాళ్ళూ కొట్లాడావ్, ఇంక నుంచి కొట్లాడకయ్యా! నీ పిల్లల్ని రోజూ తంతున్నావు, ఇంక నుంచి తన్నకయ్యా" అని చెప్పేసి చెప్తారు. ఇది స్టేజ్ - A . కర్మయోగం - మొదటి భాగంలో "స్టేజ్ - A " అన్నమాట. అది వాడు అభ్యాసం చేయగా చేయగా ఆ విధంగా కొన్ని జన్మలయిపోతాయి.

**"మంచి చేయి!"**

ఆ తరువాత ఏం చెప్తారంటే "స్టేజ్ - B"లో , "నువ్వు పక్కవాడికి మంచి చెయ్యటానికి పూనుకో, నీకు కూడా మంచి జరుగుతుంది. నువ్వు ఇతరులకు ఎంత మంచి చేస్తే నీకు అంత మంచి జరుగుతుంది. కనుక ఉపకారం చెయ్యి! ఆ వీధులు సరిగ్గా ఊడ్చు! చెట్లు నాటు! మరి అందరికీ అన్నదానం చెయ్యి! ఏదో వస్త్రదానం చెయ్యి! నువ్వు సంఘం సంగతి చూసుకోవాలి. అప్పడే నీ సంగతి కూడానూ సంఘం చూసుకుంటుంది. అప్పుడు నువ్వు ఇంకా బాగా జీవించగలవు నాయనా" అని స్టేజ్ - B లో

చెప్తారు. ఈ స్టేజ్ - A లో, స్టేజ్ - B లో 'ధ్యానం', 'ఆత్మజ్ఞానం' ఇలాంటివన్నీ రావు. ఇంకా చిన్న స్టేజ్‌లలో ఉన్నాడు వాడు.

## "ఫలితాలను ఆశించవద్దు!"

ఇకపోతే స్టేజ్ - C లో ఏమని చెప్తారంటే, "నువ్వు మంచి కర్మలు చేస్తూండు; అయితే, వాటి ఫలితాన్ని మాత్రం ఆశించకు - 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అని భగవద్గీతలో కృష్ణుడు ఈ మూడవ స్టేజ్ గురించి చెప్పాడు కదా- అలా కొన్ని జన్మలైపోయిన తరువాత కర్మఫలాలు వచ్చి తీరుతాయి! నువ్వు ఎలాంటి కర్మ చేస్తావో అలాంటి కర్మఫలాలు వచ్చే తీరుతాయి! జీసస్ క్రైస్ట్ కూడా చెప్పాడు 'As you sow; so you reap' - 'నువ్వు ఎలాంటి విత్తును విత్తుతావో అలాంటి చెట్టునే పొందుతావు'. కనుక నువ్వు వేప విత్తు విత్తి మర్రి చెట్టు వస్తూందేమోనని భయపడాల్సిన అవసరమే లేదు! వేప చెట్టే వస్తుంది! కనుక నువ్వు అందరికీ మంచి చేస్తే నీకు అందరూ మంచి చేసే తీరతారు! దాని గురించి అనవసరమైన ఆలోచనలతో మళ్ళీ నీ సమయాన్ని ఎంతమాత్రం వృథా చేసుకోవద్దు! నీ శక్తిని ఎంతమాత్రం వ్యర్థం చేసుకోవద్దు! కనుక కర్మ ఫలితాన్ని ఆశించవద్దు నాయనా! కర్మ చేయడంలోనే నీ యొక్క జీవితాన్ని నిమగ్నం చెయ్యి!....... మంచి శుభకర్మలు చేయడంలోనే!" కనుక ఇదీ "స్టేజ్ - C కర్మయోగం - మొదటిభాగం అంటే.

## "'నేను' అనేది లేకుండా కర్మలు చేయి!"

ఇకపోతే........ కర్మయోగం - మొదటిభాగంలో "స్టేజ్ - D ఏమిటంటే, "నువ్వు కర్తృత్వ భావన లేకుండా కర్మలు చేయి నాయనా; 'నేను' అనేది లేకుండా కర్మలు చేయి" అని చెప్తారు. ఇది చాలా కష్టం. ఇది నిజానికి "కర్మయోగం - రెండవభాగం"లో ఉన్నవాళ్ళే చేయగలరు. కానీ వీళ్ళందరూ చెప్తారు అదొక లక్ష్యంగా - ఎలాగంటే "నువ్వు ఐ.ఎ.ఎస్‌పాస్ కావాలి" అని చెప్పినప్పుడే వాడు అందులో కాకపోయినా మిగతా ఏదో ఒక కాంపిటీటివ్ ఎగ్జామ్ గ్రేడ్ వన్నో, ఏదో పాసవుతాడు. కానీ ఆ లక్ష్యం. ఆ సిలబస్, లక్ష్యంగా పెట్టుకోవాలి. కనుక ఈ విధంగా కర్మయోగం - మొదటి భాగంలో నాలుగు స్టేజ్‌లున్నాయి. కర్మయోగం - మొదటిభాగంలో నాలుగు స్టేజ్‌లు ఉన్నాయి. నాలుగు దశలు వున్నాయి. వీటిని మనం

(1) స్టేజ్ - A (2) స్టేజ్ - B

(3) స్టేజ్ - C (4) స్టేజ్ - D

వీటి గురించి మళ్ళీ చెప్పుకుందాం.

"స్టేజ్ - A ", అంటే, "మంచి చెయ్యకపోతే చెయ్యకపోయావ్, చెడు మాత్రం చేయకు - హింస చేయకు. తోటి ప్రాణిని కష్టపెట్టకు. చంపకు, కొట్లాడొద్దు, రక్తపాతం చేయవద్దు, నరకవద్దు."

"స్టేజ్ - B " అంటే, "తోటి ప్రాణికి సహాయం చేయి. రకరకాలుగా సహాయం చేయి. సంగీతం నేర్పించు. డాన్స్ నేర్పించు. రోడ్లు వేయి, 'అశోకుడు చెట్లు నాటెను' కదా. అంటే ఇది రెండవ స్టేజ్ అన్నమాట".

"స్టేజ్ - C అంటే, "కర్మలు మంచి కర్మలు చేస్తూండు. అయితే ఫలితాలను ఎంత మాత్రం దృష్టిలో పెట్టుకోవద్దు. ఎందుకంటే, వీటిని దృష్టిలో పెట్టుకుంటే ఏమౌతుందంటే మన సమయం వృథా అవుతుంది - అన్నమాట. మన సమయం వృథా కాకూడదు కదా! ఫలితాలు వచ్చేవి రానే వస్తూంటాయి".

"స్టేజ్ -D" అంటే, "ఆ తరువాత ఇంకా ముందుకుపోయి కర్తృత్వ భావన కూడా లేకుండా అంటే 'నేను' అనేది లేకుండా కర్మలు చెయ్యి నాయనా!" అంటూంటారు.

కనుక, 'కర్మయోగం - మొదటి భాగం'లో ఇవన్నీ అయిన తరువాత 'జ్ఞానయోగం - మొదటి భాగం' వస్తుంది.

మై డియర్ ఫ్రెండ్స్ ! అందరూ సేవా దృక్పథంలో చేరాలి, సేవా తత్పరులు కావాలి. అంతిమ పక్షంగా సేవా చక్రవర్తులు కావాలి. అయితే సేవ అన్నది మొట్టమొదటగా లౌకికపరంగా మొదలవుతుంది. క్రమేపీ క్రమేపీ అది ఆధ్యాత్మికంగా మారిపోతుంది! నా జీవితంలోనూ అలాగే జరిగింది! అందరి జీవితాల్లోనూ అలాగే జరుగుతుంది - ఇదే శాస్త్రం! ఇదే సేవా శాస్త్రం!! ఇదే సేవా విజ్ఞానం!!! ఇదే సేవా జ్ఞాన, విజ్ఞానశాస్త్ర. పరిచయం!!!! ఇంకా మనం ముందుకు పోదాం.

## "సేవా నిమగ్నతలో మూడు దశలు!"

మై డియర్ ఫ్రెండ్స్! ఈ 'సేవా' కార్యక్రమంలో ఉన్నవాళ్ళను మూడు విధాలుగా మనం విభజించవచ్చు. 'సేవా' దృక్పథంలో ప్రవేశించిన వాళ్ళు', 'సేవా తత్పరులు', 'సేవా చక్రవర్తులు'.

సేవా దృక్పథంతో ప్రవేశించిన వాళ్ళు: సేవా దృక్పథంలో ప్రవేశించిన వాళ్ళు తమ ధర్మాన్ని  తాము చూసుకుంటూ, తమ భోగాల్ని తాము చూసుకుంటూ, మిగిలిన సమయంలో చక్కగా సేవ చేస్తూంటారు.

సేవాతత్పరులు : సేవా తత్పరులైన వాళ్ళు, తమ ధర్మాన్ని తాము చూసుకుంటూ, తమ భోగాలను త్యాగం చేసి పక్కవాళ్ళందరి సేవలో నిమగ్నమవుతారు.

సేవా చక్రవర్తులు : సేవా చక్రవర్తులు తమ ధర్మాన్ని కూడా, తమ కుటుంబ ధర్మాన్ని కూడా వదిలిపెట్టేసి, అంటే బుద్ధుళ్ల లాగా, వర్ధమాన మహావీరుళ్ళ లాగా, నెల్సన్ మండేలా లాగా, మదర్‌థెరిస్సా లాగా, వాళ్ళు తమ కుటుంబ ధర్మాన్ని కూడా త్యాగం చేసేసి మరి మొత్తం సమయాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగిస్తారు.  వాళ్ళు సేవా చక్రవర్తులు.

మనం ఇంట్లోనే ఉంటూ మన ధర్మాలను మనం నిర్వర్తిస్తూ, మన హోదాలను  మనం చక్కగా చూసుకుంటూ, అప్పటికీ కాస్త సమయం ఉంటుందన్న మాట- స్పేర్ టైమ్.  అప్పుడు చుట్టుప్రక్కల వాళ్ళకు మనకు తోచినంత మనం మరి ప్రతిఫలం ఆశించకుండా చేయడం అనేది సేవా దృక్పథంలో ప్రవేశించడం అన్నమాట!

కుటుంబ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, మన భోగాలను, అంటే పేకాడటం ఆ సమయంలో మూడు గంటలు సినిమా చూసే బదులు, పక్కింటి వాళ్ళ దగ్గరికెళ్ళి, ఇంగ్లీషు నేర్పించడమో, లెక్కలు నేర్పించడమో, చెట్లు నాటించడమో చేస్తే మనం సేవాతత్పరులం.

ఇంట్లో కూడా - భర్తతో, భార్యతో కూడా ఉండకుండా - సరోజినీ నాయుడులాగా, మరి జవహర్‌లాల్ నెహ్రూలాగా, వినోబాభావేలాగా, ఎంతమందినైనా చెప్పకోవచ్చు.  రోజుకు ఇరవై నాలుగు గంటలూ సమాజ శ్రేయస్సు కోసమే వినియోగించే వాళ్ళు - వీళ్ళు సేవాచక్రవర్తులు.

## “ఎంత సేవ చేస్తే అంత తృప్తి!”

మై డియర్ ఫ్రెండ్స్ ! ఎంత సేవ చేస్తే అంత తృప్తి లభిస్తుంది. మానవుడికి నిజమైన తృప్తి - తనను తాను చూసుకోవడంలో , తన ధర్మం తాను నిర్వర్తించడంలో తమ భోగం తాను చూసుకోవడంలో, తృప్తి వున్నా- నిజమైన తృప్తి మాత్రం సేవ నుంచే మొదలవుతుంది. ఇది సేవను మొదలుపెట్టినవాడే తెలుసుకుంటాడు.  ఎలానైతే సంగీతం

నేర్చుకోని వాడికి సంగీతం యొక్క తృప్తి తెలీదో, చదరంగం నేర్చుకోనివాడికి చదరంగం ఆట యొక్క తృప్తి తెలీదో సేవ చెయ్యనివాడికి సేవ యొక్క అనంతమైన తృప్తి తెలియదుగాక, తెలియదుగాక. తెలియదు!

ఒకసారి సంగీతం నేర్చుకున్న తరువాత అందులో ఎంత మధురం ఉందో, ఒకసారి చదరంగం ఆటాడిన తరువాత ఎంత తృప్తి పొందొచ్చో, ఒకసారి సేవా కార్యక్రమం చేపట్టినవాడు ఎంత తృప్తిననుభవిస్తాడో అది ఎనలేనిదీ,మాటలలో చెప్పలేనిదీ, కొలువలేనిదీ! కనుకనే, పరిపూర్ణమైన ఆత్మలో మరి శ్రేష్ఠమైన ఆత్మలో, మరి ఆ 'సేవా కార్యక్రమం' అనేది వాళ్ళ జీవితంలో ప్రధానమైన అంశం. ఈ 'సేవ' కూడానూ 'ప్రాపంచిక సేవ' నుంచి 'ఆధ్యాత్మిక సేవ' కు మారిపోతుంది అచిరకాలంలోనే.

## 'సేవ'లో ఎవరెస్ట్ శిఖరం 'ఆధ్యాత్మిక సేవ'!

స్వామీ రామా అని చెప్పి ఒక గొప్ప యోగీశ్వరుడున్నాడు. " Living with the Himalayan Masters" అనే ఒక గొప్ప పుస్తకం వ్రాశాడు. ఆయన తన గురువు దగ్గర ఉన్నప్పడు, చిన్నప్పడు, ఆయనకు గురువు లెప్పడూ "ధ్యానం చెయ్యి, కళ్ళు రెండూ మూసుకో, చేతులు రెండూ కట్టేసుకో, శ్వాస మీద ధ్యాస పెట్టు, నీ మైండ్‌ని కంట్రోల్ చేసుకో" అని చెప్పేవాళ్ళు. ఈయనకేమో - అప్పడంతా "స్వాతంత్రోద్యమం" కదా - వెళ్ళి మరి అందులో పాల్గొనాలనీ, మరి "బ్రిటీష్ వాళ్ళని చంపాలి, నరకాలి మరి ఇండియాను స్వతంత్రం చేయాలి" అనే భావనలుండేవి. "నేను అటువైపు వెడతా! ఇదేంటి కళ్ళు మూసుకుని కూర్చోవడం? అటు వెళ్తేనే కరెక్ట్ కదా!" అని గురువుగారితో అంటే, "పిచ్చోడా! అది చిన్న పిల్ల ఆత్మలకు! నువ్వు పరిణితి చెందిన ఆత్మవు; నువ్వు అలాంటి చిన్న చిన్న సేవలు కాదు చేయాల్సింది. నువ్వు పెద్ద సేవ కోసం ఉన్నావోయ్!" అన్నప్పడు ఆ స్వామి రామాకు ఆ మాటలు అర్థమయ్యేవి కాదు. అతనికేమో దేశం కోసం పోరాడాలని వుంది, వీళ్ళేమో "నువ్వు ధ్యానం చెయ్యవయ్యా!" అంటారు. "అది వద్దు!" అన్నారు - స్వామి రామా గురువులు. "అది వద్దే వద్దు! 'దేశభక్తి' కాదు నీకు కావాల్సింది. నువ్వు 'ఓ బుద్ధుడు' లాగా తయారు కావాలి" అని చెప్పేవారు. అయిష్టంగానే ధ్యానం మొదలు పెట్టేవాడాయన. చూసారా!

## "నక్కెక్కడ?! నాగలోకమెక్కడ?!"

స్వామీ రామా పుస్తకాలు చదవండి. "Living with the Himalayan

Masters" పుస్తకం చదవండి. అప్పుడు తెలుస్తుంది ఆధ్యాత్మిక సేవ అనేది ప్రాపంచిక, లౌకిక సేవకన్నా ఎంత ఉన్నతమైందిగా ఉందో! నక్కెక్కడ? నాగలోకమెక్కడ? భూమి ఎక్కడ, మరి ఆకాశమెక్కడ? ప్రాపంచిక సేవ అన్నది భూమి మీదుంటే ఆధ్యాత్మిక సేవ అన్నది ఆకాశంలో విరాజిల్లుతోంది! ఆధ్యాత్మిక సేవలో ప్రవేశించిన తరువాత, ఆ నాగలోకంలో ప్రవేశించిన తరువాత, అంతకు ముందు చేసిన లౌకికమైన ఈ సేవ 'నక్కసేవ' లా తయారవుతుంది. కనుక, స్వామీ రామాను వారి గురువులు "నక్కసేవ ఒద్దోయ్! నాగలోక సేవ చెయ్యి! దానికి ముందుగా నక్కగా ఉన్న నువ్వు పాముపికా! నాగలోక వాసివికా!

## "ఎవరు ఏది చేయాలో వారు అదే చేయాలి!"

కనుక, చూసారా మై డియర్ ఫ్రెండ్స్! అందరూ క్రమక్రమంగా ప్రాపంచిక సేవ నుంచి ఆధ్యాత్మిక సేవ వైపు వచ్చేస్తారు. ఉదాహరణకు, నాకు సంగీతం వచ్చు; మీ అందరికీ సంగీతం నేర్పించవచ్చు. నాకు తెలుగువచ్చు. నేనందరికి తెలుగు నేర్పించవచ్చు. కానీ నేర్పిస్తానా? తెలుగు నేర్పించే వాళ్ళు కోకొల్లలు, సంగీతం నేర్పించే వాళ్ళు కోకొల్లలు. కానీ ఎవడకి తెలుసు ఆత్మశాస్త్ర జ్ఞానం? ఎవడికి తెలుసు ధ్యానశాస్త్ర జ్ఞానం? నా ఒక్కడికే తెలుసు! కనుక, నేను ఇది చెయ్యాలే కానీ, నా అమూల్యమైన సమయాన్ని ఇతర చిన్న చిన్న వాటికి పెట్టాలా? నేను హైదరాబాదు మునిసిపాలిటీ రోడ్లను ఊడవగలను. నాకా శక్తి వుంది. కానీ నేను రోడ్లు ఊడుస్తూ కూర్చుంటే నా యొక్క అసలు విశేషమైన ప్రజ్ఞ అంతా వృధా కాదూ? నా యొక్క కౌశల్యం, బూడిదలో పోసిన పన్నీరు కాదూ?

కనుక, ఎవరు ఏది చెయ్యాలో అదే వాళ్ళు చేయాలి! ఎవరి పరాకాష్ట ఎందులో ఉందో ఆ పరాకాష్టలోనే వాళ్ళు జీవించాలి. అంతేకానీ మిగతా వాళ్ళలా చెయ్యకూడదు. వివేకానంద స్వామి దగ్గరికెళ్ళి ఒకాయన అడిగాడు, "సేవ గురించి చెప్పండి స్వామీ" అని ఆయనేం చెప్పాండంటే "అవునయ్యా! ఒక మనిషి దగ్గరకు ఆకలితో వస్తాడు. వాడికి అన్నం పెడతావు. ప్రొద్దునే అన్నం పెడతావు. సాయంత్రానికి వాడన్నం అరిగిపోతుంది. మళ్ళీ వచ్చి "భిక్షాందేహి" అంటాడు, మళ్ళీ మీ తలుపు దగ్గర, మీ ఇంటిగుమ్మం ముందు నుంచుంటాడు. మళ్ళీ వాడికన్నం పెడతావు. మళ్ళీ ప్రొద్దునొస్తాడు. అంటే ఏమిటి? నువ్వేం చేస్తున్నావ్?

భోజనం పెట్టడం వల్ల? నీ మీద 'పరాన్నభుక్కు'గా వాణ్ణి తయారు చేస్తున్నావ్! స్వాన్నభుక్కు'గా చేయడం పోయి 'పరాన్నభుక్కు'గా, ఓ 'పారసైట్' గా చేస్తున్నావ్! స్వతంత్రుడిగా చేయడం పోయి పరతంత్రుడిగా చేస్తున్నావ్! అది ఒక సేవ కానే కాదు".

కానీ, ఏదో ఒకానొక అభ్యాగతి వస్తే, వాడు రాత్రిపూట వస్తే, 'భిక్షాందేహి' అంటూ వస్తే, వాడికన్నం పెట్టాలి! కానీ రెగ్యులర్‌గా భిక్షగాళ్ళకన్నం పెట్టడమనేది. అది ముదనష్టపు పని. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లకు అది పూర్తిగా వ్యతిరేకం.

అలాగే, బట్టలకోసం వస్తాడు, బట్టలు పెడతాం. అవి చిరిగిపోయిన తరువాత మళ్ళీ బట్టల కోసం వస్తాడు, జీవితం అంతా వాడికి బట్టలు పెట్టడమే మన పనేమిటి? అది 'సేవ' అనుకుంటాం. కానీ, ఇవి సేవా కార్యక్రమాలుగా ఎక్కువగా, మరి ప్రజలను నిస్తేజపరిచే కార్యక్రమాలు గానే, మరి కొంచెం ఆలోచించగలిగే వారెవరికైనా తెలుస్తాయి.

## "నిజమైన సేవ!"

అందుకే స్వామి వివేకానంద ఏమన్నాడంటే, "నువ్వు వాడికి ఆత్మజ్ఞానం ఇవ్వు; అప్పుడు వాడు మళ్ళీ నీ జోలికి రావాల్సిన అవసరం వుండదు. ఇక వాడు తన సంగతి తాను చూసుకుంటాడు, కనుక, మరి ఆత్మజ్ఞాన సేవ చెయ్యవయ్యా! అదే నిజమైన సేవ, అదే శాశ్వతమైన సేవ. అశాశ్వతమైన సేవ శాశ్వతమైన సేవకి విరుద్ధమైనది. కనుక, ఏం సేవనందిద్దాం? శాశ్వతమైన సేవనే అందిద్దాం! అంతేగానీ అశాశ్వతమైన సేవలొద్దు నాయనా! శారీరకపరమైన సేవలు అశాశ్వతమైనవి. ఆత్మపరమైన సేవలే శాశ్వతమైన సేవలు. కనుక ఆత్మపరమైన సేవలందించవయ్యా! అదే నిజమైన సేవ!" అన్నాడు స్వామి వివేకానంద చూసారా!

పిరమిడ్ మాస్టర్లందరూ ఆధ్యాత్మిక సేవలోనే మునిగి తేలుతున్న వారు, పిరమిడ్ మాస్టర్లందరూ ఆధ్యాత్మిక సేవాతత్పరులై ఉన్నవారు; ఆధ్యాత్మిక సేవా దురంధరులై, ఆధ్యాత్మిక సేవా చక్రవర్తులై వున్నవారు.

స్వామీ రామా మరి ఎంత ఆధ్యాత్మిక సేవ చేశాడో! ఆయన ఎన్ని చోట్లలో ఎన్ని యోగ కేంద్రాలు స్థాపించాడో! ఎన్నిచోట్ల ఆత్మజ్ఞాన కేంద్రాలు స్థాపించాడో! కనుక, అలాంటి సేవ చేయాలి. ఎవరికైనా ధ్యాన విద్యను

నేర్పించాం అనుకోండి. అతను ఇక తన సంగతి తాను చూసుకుంటాడు. తన ఉద్యోగం తాను చూసుకుంటాడు. అసలు ధ్యానంలోకి వచ్చిన తరువాత తిండే అక్కరలేదు. ముమ్మిడివరం బాలయోగి ఏం తిన్నాడు? తిండే అవసరం లేదు! తిండి కోసమే కదా, కూటి కోసమే కదా కోటి విద్యలూ! ఏ కోటి విద్యలూ అక్కర్లేదు. అసలు కూటి విద్యే ధ్యాన విద్య! ఆత్మకు కూడు పెడితే ఆత్మ తన శరీరాన్ని తానే చూసుకుంటుంది. ముమ్మిడి వరం బాలయోగి, హాయిగా, ఎంతసేపూ ధ్యానం చేస్తూండేవాడు, 'లడ్డూ' లాగా పెరిగాడాయన!

## "ఆత్మ సేవే నిజమైన సేవ!"

మై డియర్ ఫ్రెండ్స్! మనం ఎన్నో, ఎన్నో, అపోహల్లో ఉన్నాం. మనం ఈ శరీరమే'ననీ, 'శరీర సేవయే సేవ' అనీ! అసలు మనం మన శరీరమే కాదు, అలాంటప్పుడు శరీర సేవ సేవెలా అవుతుంది? మనం ఆత్మలమే కనుక, ఆత్మ సేవే నిజమైన సేవ! శరీరసేవ 'సేవ' కాజాలదు! ఎన్నటికీ కాజాలదు!

మైడియర్ ఫ్రెండ్స్! సేవ ఎవరికి చేస్తున్నాం! శరీరానికి చేయాలా? ఆత్మకు చేయాలా? మనం ఎవరం? మనం శరీరాలమా? ఆత్మలమా? మనం ఏదయితే దానికే సేవ చేయాలి. మనం ఏది కాదో దానికి సేవ చేసి ఏం లాభం? మన నీడ ఉందనుకోండి మన నీడకు అన్నం పెడితే మనకన్నం పెట్టినట్టా? మనం తినాలి. మన నీడకు బట్టలు కడితే మనకు బట్టలు కట్టినట్టా? మనం కట్టుకోవాలి.

మన శరీరానికి కాదు సేవ, 'మనకు' సేవ కావాలి. కనుక చూసారా; శరీరానికి చేసే సేవ మరి లౌకికమైన ప్రాపంచికమైన సేవ. అదే మన ఆత్మకు చేసే సేవ మరి ఆధ్యాత్మిక సేవ! ఆధ్యాత్మిక సేవయే నిజమైన సేవ! లౌకికమైన సేవకు ఎక్కడా నిజమైన ఆస్తికత అనేది లేదు. కొంచెం ఆలోచించే వాళ్ళెవరికైనా! ఇది బాగా అర్థమవుతుంది.

## "1976 సంవత్సరంలో, మెల్లిమెల్లిగా!"

చిన్నప్పటి నుంచి, నేను సేవాదృక్పథంలోనే పుట్టి పెరిగాను, అయితే, మా ఇంట్లో ఆధ్యాత్మికత అన్నది లేదు. అంతా ప్రాపంచికమే! ప్రాపంచికంగా వచ్చిన వాళ్ళకు విద్యలు నేర్పించడం, సంగీతం నేర్పించడం. కానీ, నేను ధ్యాన విద్యలోకి వచ్చిన తరువాత 1976 సంవత్సరంలో - మెల్లిమెల్లిగా

ఈ ఆత్మపరమైన విద్యలు నాకబ్బినప్పడు - అంతవరకూ నేను బాగా పేకాడే వాడిని రాత్రంతా! పేకాడడం మానేసి రాత్రంతా ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడం, పుస్తకాలు అందరిచేతా చదివించడం, అందరికీ ఈ ధ్యాన విద్య నేర్పించడం జరుగుతూండేది! అంటే ఏంటి? నా భోగం మానేసి నా యొక్క సేవాతత్పరతతో ఉన్నాను. అంతవరకు నేను సేవకు అంకితమైన భోగిని - అంటే చెడ్డవాణ్ణి కాదు. లౌకికపరమైన సేవాదృక్పధం ఉంది. కానీ ఆ సేవాదృక్పధం కనిష్టస్థాయిలో ఉంది. తరువాత సేవతత్పరుణ్ణయ్యా ను. 1992 సంవత్సరంలో నా ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి ఇరవై నాలుగు గంటలూ ధ్యాన ప్రచారం చేస్తూ నేను సేవా చక్రవర్తినయ్యాను! చూసారా! ఆ తరువాత నాతో పాటు ఎంతోమంది జాయిన్ అయ్యారు. ఉదాహరణకు చంద్రశేఖర శర్మను తీసుకోండి- ఆయన కూడా 1994 సంవత్సరంలో నా దగ్గరకొచ్చి చేరాడు. ఇరవై నాలుగు గంటలూ ఈ ఆధ్యాత్మిక సేవకే కేటాయిస్తూ ఆయన నా దగ్గరకొచ్చి చేరాడు! నేను ఆధ్యాత్మిక సేవా చక్రవర్తినైన తరువాత, ప్రప్రధమంగా నా దగ్గర చేరిన ఆధ్యాత్మిక సేవా చక్రవర్తి శ్రీ చంద్రశేఖరశర్మ గారు! ఆయన్ను మీరందరూ కలుసుకోవాలి!

## "గృహస్థాశ్రమం ముఖ్యం!"

ఆ తరువాత మరి ఎంతోమంది సేవా చక్రవర్తులొచ్చారు. ఉదాహరణకు D.శివప్రసాద్ గారొచ్చారు. వాళ్ళేం చేస్తున్నారు? పూర్తిగా నాతోపాటు ఉంటున్నారు. అలాగే ఎంతోమందున్నారు. గృహస్థ ధర్మంలో వుంటూ, తమ గృహస్థ ధర్మం తాము చూసుకుంటూ, భోగాలన్నీ వదిలి పెట్టేసి!

అయితే, సేవా తత్పరతలో ఉన్నవాళ్ళు కానీ, గృహస్థ ధర్మాన్ని కాస్త విస్మరించి, కాస్త ప్రక్కకి పెట్టి సేవా చక్రవర్తులైన వాళ్ళు కానీ,.... ఈ ఇద్దరు కూడానూ సమాన స్థాయిలో ఉండేవాళ్ళే! గృహస్థాశ్రమం అనేది ప్రధానమైన పాయింట్ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ పద్దెనిమిది ఆదర్శ సూత్రాలలో. మై డియర్ ఫ్రెండ్స్! అందరూ సేవా తత్పరులు కావాలి. ఆధ్యాత్మిక సేవా తత్పరులు కావాలి. ఆధ్యాత్మిక సేవయే అసలైన సేవ.

## "శారీరకపరమైన సేవ మాధవసేవ కాదు!"

మానవులకు ఆత్మపరంగా అందించే సేవయే 'మాధవ సేవ'.

మానవ సేవ అంటే శారీరకపరమైన సేవ చేస్తే, అది 'మాధవ

సేవ' కాదు. 'మాధవ ' అంటే 'ఆత్మ' ఉండాలక్కడ. కేవలం 'శరీరం' ఉంటే అది 'ఆత్మ' ఎలా అవుతుంది? ఆధ్యాత్మిక సేవ లేని మానవ సేవ- అది మానవ సేవే అవుతుంది గానీ మాధవసేవ కాజాలదు! కనుక "మానవ సేవ యే మాధవసేవ" అన్నదానికి మనం నిలబడాలంటే మానవులను మాధవులుగా చూడాలి!

## "మొదట మానవులందర్నీ మాధవులుగా చూడాలి!"

'మాధవుడు'గా అంటే, 'ఆత్మపరం' గా చూడాలి. మానవులకు శారీరక పరంగా చూస్తే అది మానవసేవే అవుతుంది కానీ మాధవసేవే ఎప్పటికీ కాజాలదు. "మానవసేవ యే మాధవసేవ" కావాలి అంటే, మొదట మానవులందర్నీ మాధవులుగా చూడాలి! అంటే, ఏ మానవుణ్ణీ శరీర పరంగా చూడకుండా, ఆత్మపరంగా చూడాలి. 'పుట్ట' పరంగా కాకుండా లోపలున్న 'పాము' పరంగా చూడాలి. తరువాత ఆ పాముకి పాలివ్వాలి. పుట్టకి కాదు పాలిచ్చేది. అంటే, ఆత్మకు సేవ చేయాలి; ఆత్మకే విధమైన సేవ కావాలి? వడలు కావాలా? ఇడ్లీలు కావాలా? బట్టలు కావాలా? ఆత్మకు జ్ఞానం కావాలి; ఆత్మకు ధ్యానం కావాలి. కనుక ఆ 'ధ్యాన సేవే', ఆ 'జ్ఞానసేవే' ఆ 'ఆత్మ సేవ'యే మాధవసేవ! మై డియర్ ఫ్రెండ్స్ "మానవ సేవ యే - మానవ సేవ", "మాధవ సేవయే - మాధవ సేవ" అని గ్రహించండి.

మానవుణ్ణి మాధవుడుగా చూద్దాం. 'అహం బ్రహ్మాస్మి- నేను శరీరం కాదు; ఈ బట్ట చిరిగి పోయిందనుకోండి నా శరీరం చిరిగినట్టా? నా శరీరం చిరిగిపోయిందనుకోండి, నా ఆత్మ చిరిగి పోయి నట్టా? నాకూ ఈ బట్టకూ సంబంధమే లేదు! అలాగే ఆత్మకూ, దేహానికీ సంబంధమే లేదు! దేహపరమైన సేవ గురించి ఎక్కువగా ఆలోచించడం మానేయండి. "అది వద్దు" అని 'స్వామీ రామా'కు ఆయన గురువులు చెప్పారు కదా! చూశారా! లేకపోతే, ఆయన స్వతంత్ర్య పోరాటం లోకి దిగి వుండేవాడే. ఏ 'భగత్ సింగ్' లాగానో, లేకపోతే ఏ 'సుభాష్‌చంద్ర బోస్' లాగానో లేక ఏ 'మహాత్మాగాంధీ'లాగానో! మూడు, మూడు స్థాయిలు! కానీ మై డియర్ ఫ్రెండ్స్, దానికి ఒప్పుకోలేదు స్వామీ రామా గురువులు.

## "ఆధ్యాత్మిక సేవచేద్దాం!"

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు కూడా దానికొప్పకోరు - ఆధ్యాత్మిక సేవ చేద్దాం! ఆధ్యాత్మిక సేవంటే ఏంటి? భజన చేయించడమా?

రామ భజన చేయడమా? కృష్ణ భజన చేయడమా? ... రామచంద్రా!.... ఏ రాముడు కోరాడు 'రామ', 'రామ', అని భజన చేయమని? అది 'రామ నామ జపం' అవుతుంది - మాధవసేవ కానే కాదు. ఆత్మపరంగా అందరికీ శిక్షణ చేయడమే. అందులో వాళ్ళను ప్రోత్సహించడమే, వాళ్ళని కూర్చోపెట్టి ధ్యానం చేయించడమే - అదే మాధవసేవ.

గుర్తుంచుకోండి, "మానవ సేవ యే మాధవ సేవ" కాదు. "మాధవసేవయే మాధవసేవ". మానవసేవ అన్నది కేవలం మానవసేవే. ప్రాపంచికమైన లౌకికమైన సేవ. మానవసేవలో పరాకాష్ట- మదర్‌థెరిస్సా, మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ వంటివారు. కానీ మాధవ సేవలో పరాకాష్ట జీసస్ క్రైస్ట్, గౌతమబుద్ధుడు, వర్ధమాన మహావీరుడు, రమణమహర్షి. "మాధవ సేవయే మాధవసేవ - మానవ సేవయే మానవ సేవ." ఓ ఆలుగడ్డ అన్నది "వంకాయ' కాజాలదు! ఓ వంకాయ అన్నది 'ఆలుగడ్డ' కాజాలదు! వంకాయ కూర అన్నది వంకాయ కూరే - ఆలుగడ్డ కూర ఆలుగడ్డ కూరే!" ఆలుగడ్డ కూరే వంకాయ కూర" అంటే ఎలాగ? "మానవసేవ యే మాధవసేవ" అంటే ఎలాగ? కుదరదు గాక కుదరదు! కనుక, గుర్తుంచుకోండి, "మానవసేవ యే మానవసేవ". "మాధవసేవ యే మాధవసేవ".

## కర్మయోగం - 2

మానవసేవలో - ఒకానొక ఆత్మ పరాకాష్ట చెందిన తరువాత ఆ ఆత్మ, మాధవసేవలో పరాకాష్టను ఉబలాట పడుతుంది. మానవ సేవలలో మూడు స్టేజ్‌లు, మానవ సేవాదృక్పథంలో ప్రవేశించడం, మానవ సేవా తత్పరులు, కావడం, మానవసేవా చక్రవర్తులు కావడం. ఆ తరువాత "కర్మయోగం-2" ఏమిటంటే, "కర్మయోగం-2" లో మరి ఆ యొక్క సేవా తత్పరులు, ఆయొక్క సేవా చక్రవర్తులు- మూడు స్టేజ్‌లున్నాయి మై డియర్ ఫ్రెండ్స్ - పిరమిడ్ మాస్టర్లందరూ కూడానూ ఆధ్యాత్మిక సేవా తత్పరులు. ఆధ్యాత్మిక సేవా చక్రవర్తులు. గౌతమ బుద్ధుడిలాగా! జీసస్ క్రైస్ట్‌లాగా!! వర్ధమాన మహావీరుడి లాగా!!!

## "ఎంత సేవచేస్తామో, అంత లాభం!"

ఈ రోజు చాలా సుస్పష్టంగా మనం తెలుసుకున్నాం. చూశారా! సేవ అంటే వ్యాపారం కాదు. ప్రతిఫలం ఆశిస్తే, ప్రతిఫలం తీసుకుంటే అది

సేవకాదు. ప్రతిఫలం వస్తుంది! రాకుండా ఎలా వుంటుంది!? ప్రతి కర్మకూ దాని యొక్క ప్రతిఫలం ఉంది. మనం చెడు చేస్తే చెడు వస్తుంది; మంచి చేస్తే మంచి వస్తుంది; కనుక, మనం సేవ చేసామనుకోండి మనక్కూడా ఎంతోమంది, ఎంతో సేవ చేస్తారు. మనక్కూడా ఎంతో వస్తుంది. "చేసుకున్నవాడికి చేసుకున్నంత మహాదేవా".

ఈ వీరప్పన్ ఎంతో చెడు చేస్తున్నాడు, చేసాడు. మరి వాడికెంత చెడు జరుగుతుందో భవిష్యత్తులో! దానికేమైనా కొలబద్ధా, ప్రమాణమేమైనా, ఉందేమిటి?! హిట్లర్ ఎంత చెడు చేశాడు? మరి ఎంత చెడు పొందాలి?! - కర్మ సిద్ధాంతం అది. మంచి చేస్తే మంచి జరుగు తుంది. చెడు చేస్తే చెడు జరుగుతుంది. కనుక, మంచి చేయడానికి పూనుకున్న వాడే ఒకింత తెలివున్నవాడు, కనుక ఎవరు ఎవరికి ఎంత సేవ చేస్తారో, వాళ్ళు తిరిగి తద్వారా అంతే లాభం పొందుతారు.

మిత్రలాభమొస్తుంది! శ్రీకృష్ణుడికి 16,000 మంది గోపికలు, అంటే అంతమంది మిత్రులెలా వచ్చారు? కంసుడికి వాళ్ళింట్లో పెళ్ళామే వాణ్ణి ఒప్పకోదే! వాడి చెల్లే వాణ్ణి ఒప్పకోదే! కనుక మిత్రలాభం అనేది ఎంతటి లాభమో! మరి పరవస్తు చిన్నయసూరి, విష్ణుశర్మ వీరి పంచతంత్రంలోని కథలు తెలుసు కదా! మిత్రలాభం తెలుసుకదా! ఎవరైతే ఇంకొకరికి నిస్వార్థ మైన సేవ చేస్తారో వారికి అనంతమైన మిత్రలాభ మొస్తుంది.

ఉదాహరణకు, నేనిప్పుడు ఎవరిదగ్గరకైనా, ఎవరి ఇంటికైనా, వెళ్ళి సంవత్సరం పాటు భోంచేసుకోవచ్చు! ఈ మధుసూదనరావు గారున్నారు. వాళ్ళింట్లో ఉండి సంవత్సరం పాటు హాయిగా మెక్కొచ్చు నేను! పెడతాడో లేదో కానీ, దండిగా పెడతాడు లెండి! ఎందుకంటే, ఆయనకు నేను సేవ చేస్తున్నాను. ఈ ఆధ్యాత్మిక సత్యాలు చెప్తున్నప్పడు ఆయన, వడా ఇస్తాడు (ఇందాక వడ తీసుకొచ్చాడు) ఇవాళ దసరా కదా! విజయదశమి కదా! మంచి వడలు పట్టుకొచ్చాడు. మరి ఇక్కడున్న రికార్డిస్టు గారు ఆయన మంచి కాఫీ ఇచ్చారు. నేను డబ్బులిచ్చానా? వాళ్ళకు!

### "సేవ అనేది సృష్టి యొక్క మౌలిక ధర్మం!"

సేవ చేయడమనేది, ఆధ్యాత్మిక సేవ చేయడమనేది సృష్టి యొక్క మౌలికధర్మం. వ్యక్తి యొక్క చిన్న పరిధి నుంచి సృష్టి యొక్క విస్తారమైన

పరిధిని చేరడమే ఆధ్యాత్మికత. అందులో జీవించడమే, ఆ సృష్టి యొక్క విస్తారమైన పరిధిలో మనుగడను సాగించడమే సేవా కార్యక్రమం. అక్కడ మనుగడ సాగిస్తే ఎన్ని లాభాలో!

చూసారా! జీసస్ క్రైస్ట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరాధ్యదైవం అయిపోయాడు. జీసస్, శ్రీకృష్ణుడు వీళ్ళంతా ఏం చేసారు? ఆధ్యాత్మిక సేవలందించారు. వీళ్ళు ఎవరికైనా అన్నదానం పెట్టించారా? వస్త్రాలు ఇచ్చారా? రోడ్లు వేయించారా? చెట్లు నాటించారా? అశోకుడి లాగా, అశోకుడికున్నాయేమిటి ఎక్కడైనా గుళ్ళు మరి జీసస్ క్రైస్ట్‌కెందుకు న్నాయి? అశోకుడి గుడి వుండాలి కదా? మరి జీసస్ క్రైస్ట్ కెందుకున్నాయి? కృష్ణుడికెందుకున్నాయి? కృష్ణుడేమీ రోడ్లు వేయించలేదే! కనుక మైడియర్ ఫ్రెండ్స్! ఆధ్యాత్మిక సేవ చేసి చూడండి! గాంధీజీ గారికి గుళ్ళు వస్తాయేమిటి? మదర్‌థెరిస్సాకి గుళ్ళు వస్తాయేమిటి? రావు! మహావీరునికి గుళ్ళు వస్తాయి!

మైడియర్ ఫ్రెండ్స్! సేవలో ప్రవేశిద్దాం! సేవా దృక్పథంలో, సేవా నిరతిలో, సేవా తత్పరతలో, సేవా చక్రవర్తిత్వంలో, తరువాత, లౌకికమైనటు వంటి సేవలో నుంచి తప్పకుంటూ, తప్పకుంటూ ఆధ్యాత్మిక సేవలో ప్రవేశిద్దాం. ఆధ్యాత్మిక సేవయే సేవ! ప్రాపంచిక సేవ అనేది అదొక చిన్న రిహార్సలు! కనుక, గాంధీగారున్నారు- ఆయన శరీరం వదలి పెట్టేశారు. పై లోకంలో కెళ్ళారు, అన్నీ ఆలోచించారు. "నేనేమిటి చేసింది? నేను బుద్ధుడి లెవెల్లో ఎందుకు జీవించలేకపోయాను? ఛ! "He was very very unhappy. ఆయన మళ్ళీ వచ్చి ఇంకొక జన్మ తీసుకున్నారు. మదర్‌థెరిస్సా కూడా అంతే. వాళ్ళంతా ఇక్కడున్నారు. మీకు తెలియదు; నాకు తెలుసు. వాళ్ళెక్కడెక్కడ ఉన్నారో నాకు తెలుసు, మీకు తెలియదు గాక తెలియదు!

మై డియర్ ఫ్రెండ్స్! ఈ యొక్క సేవ అన్నదాని యొక్క ప్రచండమైన విశ్వరూపం తెలుసుకోవాలంటే ఏ ఒక్కదాని యొక్క విశ్వరూపం తెలుసుకోవాలన్నా కూడానూ - మీకు మూడవకన్నుండాల్సిందే! లేకపోతే తెలియదు గాక, తెలియదు! మూడవ కన్నులో, దివ్య చక్షువులో నిష్ణాతులైన వారి దగ్గరినుంచే ఏ కాన్సెప్ట్ అయినా తెలుసుకోవాలి.

## "ఆత్మ సేవయే శారీరక సేవ!"

కనుక, ఈ రోజు మరి 'సేవ' అన్న కాన్సెప్ట్ గురించి విస్తారంగా తెలుసుకున్నాం. గుర్తుంచుకోండి, "ఆత్మ సేవయే మాధవసేవ". శారీరక సేవ అన్నది కేవలం మానవసేవ మాత్రమే అవుతుంది. కానీ, శారీరక సేవ ఆత్మ సేవ కాజాలదు. కానీ ఆత్మ సేవ శారీరక సేవ అవుతుంది!

మనం ధ్యానంలో కూర్చున్నామనుకోండి. మన రోగాలన్నీ పోతాయి! అంటే మన శరీరానికి సేవ చేసినట్టే! ధ్యానం నేర్పించాం అనుకోండి వాడి మైండ్ ప్యూర్ అయిపోతుంది. మరి ప్రజలందరూ వాడికి అన్నం పెడతారు. ఇందాక నాకు వడలు పెట్టినట్టు! అంటే నా కడుపు నింపారు వాళ్ళు! నా ఆకలి కూడా వాళ్ళు తీర్చారు. చూసారా! అంటే ఏమిటి, "ఆత్మ సేవయే శారీరక సేవ" అవుతుంది. కాని "శారీరక సేవ" మాత్రం ఆత్మ సేవ కాజాలదు. శాశ్వతమైన సేవలో అశాశ్వతమైనవన్నీ ఉన్నాయి కానీ, అశాశ్వతమైన సేవలో శాశ్వతం మరి 'బొట్టు మాత్రం కూడా లేదు'. ఆత్మ సేవలో అన్నీ వున్నాయి. కనుక ఆత్మసేవకే ప్రాధమికతా, ప్రాధాన్యతా!

మై డియర్ ఫ్రెండ్స్! ఈ శారీరక అలజడులు కానీ, శారీరక రుగ్మతలు కానీ, శారీరక వ్యాధులు గానీ, మానసిక రుగ్మతలు గానీ, మానసిక అలజడులు గానీ, మానసిక ఒత్తిడులు గానీ, మరి సంఘపరమైన ఇబ్బందులు కానీ, ఆర్థికపరమైన కష్టాలు కానీ, నష్టాలు కానీ, అన్నిటికీ ఒకే ఒక్క జవాబు - అదే ధ్యానం. కనుక ఎవరికైతే ధ్యానమందిస్తామో, వాళ్ళ కుటుంబ పరిస్థితులన్నీ బాగుపడిపోతాయి. వాళ్ల ఆర్థిక పరిస్థితులన్నీ బాగుపడతాయి. వాళ్ళ శారీరక పరిస్థితులు బాగుపడతాయి. వాళ్ళ మానసిక పరిస్థితులు బాగుపడతాయి. వెరసి మొత్తం అంతా సస్యశ్యామలం! అంత "మూడు పువ్వులు ఆరు కాయాలు"; "నిత్య కళ్యాణం పచ్చ తోరణం" అవుతుంది!

కనుక ధ్యానం నేర్పిద్దాం. ఇంకేమీ చెయ్యనక్కర లేదు. వాడు పేదవాడా? వాడు ధనికుడా? ఇవేమీ చూడవద్దు. వాడు చిన్నపిల్లవాడా? పెద్దవాడా? ఆడవాళ్ళా? మగవాళ్ళా? పల్లెవాసులా? పట్టణవాసులా? - అదంతా మనకనవసరం. కనబడిన ప్రతివాళ్ళకూ, ధ్యానం నేర్పిద్దాం. ధ్యానం నేర్పించడమే ఆధ్యాత్మిక సేవ, ఆధ్యాత్మిక సేవయే మాధవసేవ.

## దేశమంటే మట్టి కాదోయ్...! దేశమంటే మనుషులోయ్!

'శరీరానికి అన్నం పెట్టడం', 'శరీరానికి బట్టలు దానం చేయడం', 'శరీరానికేదో ఉద్యోగం ఇవ్వడం', 'మరి రోడ్లు వెయ్యడం', .... గురజాడ అప్పారావుగారేమన్నారు? .... 'దేశమంటే మట్టి కాదోయ్- మనుషులోయ్" అన్నారు. కనుక, మట్టిని బంగారం చేశామనుకోండి - ఈ హైదరాబాద్ అంతా గోల్డెన్ రోడ్స్ వచ్చాయనుకోండి - అదేమైనా "స్వర్ణాంధ్రప్రదేశ్" అవుతుందేమిటి? మనుషులు బంగారం కావాలి కానీ రోడ్లు బంగారం అయితే ఏం లాభం?! "ఇరవై నాలుగు గంటలూ కరెంట్ పోవటం లేదు" అయితే ఏం లాభం? పేకాడుకుంటూ కూర్చోడానికా? మనిషికి పేకాడుకుంటూండడం కావాలా? మరి మనుషులు "అసలైన స్వర్ణం" కావాలి. మనుషులు "అసలైన బంగారం" కావాలి.

## 'బంగారు' ఆంధ్రప్రదేశ్!

సత్యసాయిబాబాగారు అందరినీ 'బంగారూ' అని పిలుస్తారు. అంటే 'ఏదో రోజున బంగారం అవుతావురా! అవరా!" అని. ఎప్పటికైనా ఆత్మపరంగానే బంగారు అవుతాం కానీ శరీరపరంగా కాదు! "బంగారు, బంగారూ" అని పిలుస్తారు. ఎక్కడయ్యాం మనం బంగారం?! ఇత్తడి అయ్యాం. ఆయన బంగారమయ్యాడు. అందర్నీ 'బంగారం' అని పిలుస్తున్నాడు. మనం ధ్యాన విద్యను అభ్యసించడం లేదు. భజనలు చేస్తున్నాం. 'ఆనాపానసతి' , 'శ్వాస మీద ధ్యాస' అన్నదే అందరి యొక్క ఏకైక 'బంగారు' కార్యక్రమం. అన్యదా శరణం నాస్తి. వేరే 'బంగారు' కార్యక్రమం లేనే లేదు. మైడియర్ ఫ్రెండ్స్.

## "జంతు ప్రపంచాన్ని పరిరక్షించాలి!"

మై డియర్ పిరమిడ్ మాస్టర్స్! ఈ యొక్క జంతువులను చంపి మానవులకు పెట్టడం. మేకను కోసి అంటే ఆ దేవుణ్ణి కోసి - ఈ దేవుడికి పెట్టడమనేది అదేం సేవబ్బా? మొదట జంతు ప్రపంచాన్ని పరిరక్షించాలి. మానవుడి సేవ జంతువులతో మొదలు కావాలి. ఇంకా వెనక్కు పోయి వృక్షాలతో మొదలు కావాలి. వృక్షాలను నరుకరాదు. ఏదో చక్కటి రోడ్ వేయాలనుకోండి. రోడ్ మధ్యగా ఒక చెట్టు ఉందనుకోండి - దాన్ని నరకవచ్చు; అయితే ఇష్టం వచ్చినట్లుగా చెట్లు నరికి పొయ్యిలో పెడితే... రామచంద్రా..! పొయ్యిలోకి బొగ్గులు వాడుకుందాం లేకపోతే పెట్రోలు

వాడుకుందాం. కానీ చెట్లను నరికి పొయ్యిలో పిడితే ఎలాగబ్బా? చెట్లు నరికే కార్యక్రమం చాలా హింసా కార్యక్రమం, జంతువులను చంపి తినే - ఆ శవాలను తినే కార్యక్రమం, మహా హింసా కార్యక్రమం - అది సేవా కార్యక్రమం కాదు.

## "మటన్, బిరియానీలు సప్లై చేయవద్దు!"

ఎవరికీ మటన్ బిరియానీలు చేయవద్దు! సముద్ర తీరాల వెంబడి ఎంత కంపో! చేపలు పడతారు. చేపలు పట్టే అర్హత మరి మనకెవరిచ్చారు??

కనుక, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి పాయింట్లు, రెండే రెండు పాయింట్లు. "హింసా ఛోడియే - హంసా పకడియే". ఈ యొక్క సేవా కార్యక్రమంలో చేరుదాం! సేవ మొదటగా జంతు ప్రపంచానికీ, వృక్ష ప్రపంచానికీ! తరువాత మానవ ప్రపంచానికీ!

ఏ జంతువు చంపబడకూడదు. అనవసరంగా ఏ చెట్టూ నరకబడకూడదు. మానవులందర్నీ మాధవులుగా చూద్దాం. ఆత్మపరంగా అందరికీ ధ్యాన విద్య నేర్పించుదాం. కనుక అటు మాంసభక్షణ చేయక పోవడం, చెట్లని నరక్కపోవడం , ఇక అందరికీ ధ్యానం నేర్పించడం, ఈ మూడే సేవా కార్యక్రమాలు.

## "పిరమిడ్ సూత్రాలే మానవాళికి ఆదర్శ సూత్రాలు!"

హింసను చెయ్యకపోవడం, మరి హంసను పట్టుకోవడం, మైడియర్ ఫ్రెండ్స్! పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ వారి ఈ యొక్క స్పష్టతే సకల మానవజాతి యొక్క స్పష్టత! పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి ఈ కార్యక్రమాలే సర్వ మానవజాతి యొక్క కార్యక్రమాలు! పిరమిడ్ సొసైటీ వారి ఈ యొక్క విజ్ఞానమే మానవజాతికంతా కూడానూ పాఠ్యాంశం. మరి దైనందిన జీవనశాస్త్రం విజ్ఞానం కాబోతుంది! స్కూల్స్ అన్నింటిలో, భవిష్యత్తులో ఈ పిరమిడ్ పుస్తకాలే పాఠ్య గ్రంథాలుగా వస్తాయి. ఈ పిరమిడ్ ఆదర్శ సూత్రాలే మానవాళికి ఆదర్శ సూత్రాలు అవుతాయి. మైడియర్ ఫ్రెండ్స్!

అందరూ శ్వాస మీద ధ్యాస పెడదాం. కళ్ళు రెండూ మూసు కుందాం, ఈ క్షణం నుంచే శ్వాస మీద ధ్యాస పెడదాం. ఈ క్షణం నుంచే శాకాహారులు అవుదాం, ఈక్షణం నుంచే వృక్షాలను పెంచుదాం- ఈ

క్షణం నుంచే అందరికీ అన్నీ నేర్పించుదాం. అందరికీ "ఇవ్వాళ నువ్వు ధ్యాన విద్య నేర్చుకున్నావ్, అందరికీ నువ్వు ధ్యాన విద్య నేర్పించు, ఇవాళ నువ్వు శాకాహారివయ్యావ్, అందర్నీ శాకాహారులుగా చెయ్యి, ఇవాళ వృక్షాలను నరకకూడదని నేర్చుకున్నావు, కనుక అందరికీ నేర్పించు" అని భోధించుదాం!

చేద్దాం! చేయిద్దాం! మనమెంత చేస్తే అంత చేయించగల శక్తి వస్తుంది. రెండూ పరస్పరం ఒక దాని మీద ఒకటి ఆధారపడి వున్నాయి.

Teaching is the best way of learning.

-బ్రహ్మర్షి పత్రీజీ

# ధ్యానం అంటే

ధ్యానం అంటే ప్రార్థన కాదు

ధ్యానం అంటే స్తోత్రం కాదు

ధ్యానం అంటే నామస్మరణ కాదు

ధ్యానం అంటే మంత్రజపం కాదు

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

# ధ్యానం వలన లాభాలు :

1) శారీరక ధారుఢ్యం

2) మానసిక ప్రశాంతి

3) బుద్ధి సునిశిత

4) ఆర్థిక సంక్షేమం

5) సుమిత్ర ప్రాప్తి

6) ఆధ్యాత్మిక విజ్ఞానం

# ముక్తి

ధ్యాన సాధన ద్వారానే దివ్యచక్షువు ఉత్తేజితమవుతుంది

ధ్యాన సాధన ద్వారా మనమే గురువులుగా మారుతాం

ధ్యాన సాధన ద్వారా మనమే దైవస్వరూపాలమని తెలుసుకుంటాం

*- బ్రహ్మర్షి పత్రీజీ*